పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 230 | విశాఖపట్నం | 21-5-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 230 | VISAKHAPATNAM | 21-5-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram

SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | paytm | Pay

2లో

దేశానికే ఆదర్శంగా ఏపీ విద్యా వ్యవస్థ: మంత్రి లోకేశ్

ముందుకు సాగని గృహ నిర్మాణాలు!



5లో

6లో

హార్మోన్ల సమస్యలు ఉన్న మహిళలు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారాలు!

కుప్పంలో తాటి ముంజలు ఆస్వాదించిన

చంద్రబాబు దంపతులు

చిత్తూరు, పతాకం న్యూస్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి భువనేశ్వరి గ్రామీణ జీవనశైలికి, సామాన్య ప్రజలకు తాము ఎంత దగ్గరో నిరూపించే ఒక అరుదైన క్షణాన్ని పంచుకున్నారు. బుధవారం సీఎం దంపతులు కుప్పంకు బయలుదేరారు.

ఈ క్రమంలో రహదారి పక్కన తాటి ముంజలు అమ్ముతున్న ఒక పేద కార్మికుడి వద్ద సీఎం దంపతుల వాహనం ఆగింది. వారు స్వయంగా వాహనం దిగి, ఆ కార్మికుడి వద్ద తాటి ముంజలను కొనుగోలు చేయడమే కాకుండా, ఆయనతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ విషయాన్ని సీఎం తన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'కల్తీ లేదు... కార్బైడ్ లేదు.. పురుగు మందుల గోల లేదు.. మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

భూముల రిజిస్ట్రేషన్‌లో.. అక్రమాలు...!

- ప్రభుత్వ ఖజానాకు గండికొట్టినట్లు ఆరోపణలు?
- పెద్దఎత్తున డబ్బు చేతులు మారినట్లు ఫిర్యాదులు!
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు..
- విచారణ ప్రారంభించిన అధికారులు

పార్వతీపురం, పతాకం న్యూస్: సాలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక క్రిస్టియన్ సంస్థకు చెందిన భూముల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే..

సాలూరులో డగ్లస్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన భూముల రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగాయి. ఈ విషయంలో పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారినట్టు పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదులు అందాయి. వాస్తవంగా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పడి సుమారు నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత మరో సొసైటీ అదే పేరున రిజిస్టర్ కావడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భూములు కాజేసేందుకే 2025లో కొత్త డాక్యుమెంట్లతో పాత సొసైటీ ఏర్పడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా ఈ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేశారు. ఈనెల 16న ఈ ప్రక్రియ ముగించారు. దీనిపై కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు అందడంతో విచారణ ప్రారంభమైంది. ఈ నెల 18న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సాలూరు సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు (తరువాయి 2వ పేజీలో)

మెడికల్ షాపుల బంద్

2లో

ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి: అచ్చెన్నాయుడు

అమరావతి, పతాకం న్యూస్: ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టిస్తూ, ఇతర వ్యవసాయేతర పనులకు తరలించడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్రమ నిల్వలపై నిఘా పెట్టేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫెర్టిలైజర్ డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల పంపిణీలో వ్యవసాయ శాఖ అధికారుల వైపు నుంచి ఏమైనా నిర్లక్ష్యం ఉందా అనే కోణంలోనూ (తరువాయి 2వ పేజీలో)

ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం

ప్రభుత్వం కృషి : కొండపల్లి

అమరావతి, పతాకం న్యూస్: ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కరానికి ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఏపీ ఎన్ఆర్టీ భవన్‌లో మంత్రి కొండపల్లితో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై సలహా కమిటీ సమావేశమైంది. ఏపీలో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఏపీలో తెలంగాణ కమిటీ పర్యటిస్తోంది. గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమంపై ఏపీలో అమలవుతున్న పద్ధతులపై తెలంగాణ కమిటీ అధ్యయనం చేస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రవాసాంధ్రులకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు, అత్యవసర సహాయక చర్యలను తెలంగాణ బృందం పరిశీలించింది. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, నకిలీ ఏజెంట్లపై ఏపీ పోలీస్ ఎన్నారై సెల్ తీసుకుంటున్న చట్టపరమైన చర్యలపై చర్చించారు. గల్ఫ్ వలసదారుల భద్రత, బీమా సౌకర్యాలు, స్వదేశానికి తిరిగి వచ్చిన వారి కోసం అమలు చేస్తున్న పునరావాస పథకాలపై అధికారులను అడిగి తెలంగాణ సభ్యులు తెలుసుకున్నారు. ఏపీఎన్ఆర్టీ విధానాలపై అక్కడి ప్రభుత్వానికి తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ సభ్యులు ఓ నివేదిక ఇవ్వనున్నారు.

ఏపీలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు..

ఉక్కపోతతో ప్రజల ఇబ్బందులు

అమరావతి, పతాకం న్యూస్: ఆంధ్రప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ వేసవి సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే పిడుగురాళ్ల తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కాపురం జిల్లా నందనమారెళ్ల ప్రాంతాల్లో రికార్డ్ అయ్యాయి. ఈ రెండు ప్రాంతాల్లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇక పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డ్ అవుతున్నాయి.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

సంపాదకీయం

ఆందోళనకరం.

భారతదేశ గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీసేలా ఇటీవల మధ్యప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పునివ్వడం ఆందోళనకరం. భోజ్ శాల-కమల్ మౌలా మసీదు సముదాయంపై హక్కులకు సంబంధించి తీర్పులో పేర్కొన్న అంశాలు ప్రజాస్వామ్య వాదులను కలవరపరుస్తున్నాయి. వెయ్యేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈ సముదాయాన్ని చర్చనీయాంశం చేయడం ద్వారా దేశవ్యాప్తంగా వివాదాలు సృష్టించి, బహుళత్వాన్ని దెబ్బతీయాలన్న బిజెపి -- ఆర్ఎస్ఎస్ లాంటి మతతత్వ శక్తులకు సహకరించేలా తీర్పు ఉండటం దురదృష్టకరం. హిందువులు, ముస్లిములు వేర్వేరు రోజుల్లో ప్రార్థనలు చేసుకోవడానికి హక్కు కల్పిస్తూ ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు కొట్టివేసి, హిందువులకే సర్వహక్కులు కల్పించడం 1991లో పార్లమెంట్ ఆమోదించిన ప్రార్థనా స్థలాల చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అయోధ్య మినహా ఏ ప్రార్థనా స్థలం మతస్వరూపాన్నీ మార్పు చేయకూడదని పేర్కొన్న నాటి చట్టం లక్ష్యం సామాజిక సామరస్యాన్ని, బ్రిటీష్ పాలనలో సృష్టించిన విభజన, వివాదాలను అదుపు చేయడమే. మత స్వరూపాన్ని మార్చడానికి సంబంధించి అన్ని పెండింగ్ కేసులు రద్దయిపోయాయని, కొత్త కేసులు నమోదు చేయకూడదని ఆ చట్టం నిర్దేశిస్తుండగా, ఈ ప్రాంగణం చరిత్ర ఆధారంగా ఆలయమే అని ప్రకటించడం ద్వారా ఈ చట్టం వర్తించదని హైకోర్టు ప్రకటించడం విడ్డూరం. ప్రాచీన స్మారక స్థలాలు, పురాతత్వ ప్రదేశాలు, అవశేషాల చట్టం పరిధిలో ఉండటం వల్ల 1991 చట్టం వర్తించదని కొత్త భాష్యం చెబుతోంది. అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు 1990 నుంచి భోజ్ శాల -- కమల్ మౌలా మసీదును ఆర్ఎస్ఎస్ శక్తులు వివాదాస్పదం చేశాయి. మధ్యప్రదేశ్ లోని ఇండోర్ కు 90 కిలోమీటర్ల దూరంలోని ధార్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంగణం 14వ శతాబ్దంలో సూఫీ మత గురువు కమాలుద్దీన్ చిష్టీ మసీదుగానే నిర్వహించారని, ఆ సమాధి కూడా ఇక్కడ ఉండటంతో 'కమల్ మౌలా మసీదు-గా చరిత్రలో నమోదై ఉంది. 11వ శతాబ్దంలో భోజ రాజు వాగ్దేవి (సరస్వతి) ఆలయాన్ని నిర్మించారని, సంస్కృత విద్యాకేంద్రంగానూ పనిచేసిందని, మహమ్మద్ ఖిల్జీ దాడి తర్వాత మసీదుగా మారిందన్నది హిందూ సంస్థల వాదన. ఈ ప్రాంగణం మధ్య యుగం నాటి జైన ఆలయం, గురుకులమని, 19వ శతాబ్దంలో కనుగొన్న శిల్పం సరస్వతిది కాదని, తాము వాఘ్ దేవతగా పూజించే అంబికది అని, ప్రధాన శిల్పంపై జైన తీర్థంకరుని రూపం ఉందని జైన సమాజం న్యాయస్థానంలో వాదనలు వినిపిస్తోంది. హైకోర్టు ఆదేశాలతో సర్వే నిర్వహించిన ఎఎస్ఐ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకుంది. కార్బన్ డేటింగ్ నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినా.. అలా చేసిన దాఖలాలేమీ లేవు. ఇదే ఎఎస్ఐ 1903 లో కమల్ మౌలా మసీదుగా ప్రకటించి, రక్షిత స్మారక చిహ్నంగా గుర్తించిన అంశాన్ని మరుగుపర్చలేం. 1935లో అప్పటి ధార్ సంస్థానం (ప్రిన్లీ స్టేట్) 1935 జూన్ 13న ధార్ దర్బార్ (సంస్థాన ఆస్థానం)లో హిందూ దివాన్ బహదూర్ కె. నాడ్కర్ అధ్యక్షతన ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి, అదే ఏడాది ఆగస్టు 24న ఐలాన్ (ప్రకటన) జారీ చేసింది. ఈ సముదాయాన్ని 'కమల్ మౌలా మసీదు-గా ప్రకటించడంతోపాటు, ముస్లిములు నమాజ్ చేసుకునేందుకు అనుమతించింది. ఈ ఆధారాలన్నీ పక్కనపెట్టి, 1991 ప్రార్థనా స్థలాల చట్టాన్ని తోసిరాజని ప్రార్థనా స్థలాలపై హక్కులు కల్పించాలని కోరుతున్న సంఘ్ సంస్థల డిమాండ్లకు న్యాయస్థానాలు తలొగ్గుతుండటం దురదృష్టకరం. సరస్వతీ ఆలయం కోసమంటూ ప్రచారం చేసే బిజెపి -- ఆర్ఎస్ఎస్ నేతలకు తమ పాలనలోని రాష్ట్రాల్లో, మధ్య ప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో మహిళల అక్షరాస్యత గురించి నోరుపెగలదు. మతతత్వం అది మెజార్టీ లేదా మైనార్టీ ఏదైనా జాతీయ ఐక్యతకు, ప్రజాస్వామ్య జీవన విధానానికి ముప్పు. ఈ తీర్పును నిలువరించడం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక సూత్రాలను అత్యున్నత న్యాయస్థానం నిలబెడుతుందని ఆశిద్దాం.

మోడీ, అమిత్ షా, ఆరెస్సెస్‌పై రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ, పతాకం న్యూస్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ సంస్థ 'దేశద్రోహులు' అని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు సూచించడం తీవ్ర దుమారం రేపింది. ఆర్థిక సంక్షోభం వల్ల దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుకుంటూ బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. పొదుపు కోసం పిలుపునిచ్చిన ప్రధానియే వాటిని పాటించడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. రాహుల్ గాంధీ వాడిన భాష పాకిస్థాన్, ఆ దేశానికి మద్దతిచ్చే ఉగ్రవాదుల భాషను పోలి ఉందని బీజేపీ మండిపడింది. ఆయన వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. అక్కడి నేతలు చెప్పినట్లుగానే రాహుల్ గాంధీ మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిని అవమానించడం అతడికి అలవాటుగా మారిందని అన్నారు. రాహుల్ గాంధీ భాష పాకిస్థాన్ నాయకుల్లా ఉందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి ప్రపంచానికి తెలుసని, రాహుల్ గాంధీ నుంచి ప్రశంసలు అవసరం లేదని విమర్శించారు. దేశంలో అశాంతిని రగుల్చాలని రాహుల్ గాంధీ కోరుకుంటున్నారని అన్నారు. కానీ మోదీ, అమిత్ షాలకు ప్రజలు అండగా ఉన్నారని అన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ మరిచిపోకూడదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు. ప్రధానిని అనడం ద్వారా రాహుల్ గాంధీ 140 కోట్ల మంది ప్రజలను దేశద్రోహులుగా పేర్కొన్నట్లే అన్నారు. ఆయన భాష పాకిస్థాన్, ఉగ్రవాదులను పోలి ఉందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కూల్చివేసే పనిని కాంగ్రెస్ చేపట్టిందని సీనియర్ బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ అన్నారు. వాస్తవానికి రాహుల్ గాంధీ ఈ రోజు ఏవైతే మాట్లాడుతున్నారో, నాడు ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీకి వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. అవమానకరమైన భాషను ఉపయోగించడం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రధాని మోదీని దూషించడం, ఆరెస్సెస్‌ను దూషించడం వారికి పరిపాటిగా మారిందని అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు.

మెడికల్ షాపుల బంద్

తిరుపతి, పతాకం న్యూస్: దేశవ్యాప్తంగా ఔషధ వ్యాపారులకు ఎదురవుతున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా .... పుత్తూరు పట్టణంలోని మెడికల్ షాపులు బుధవారం. స్వచ్ఛందంగా బంద్ నిర్వహించాయి. ఈ సందర్భంగా పుత్తూరు కెమిస్ట్రీ, డ్రగ్స్ అసోసియేషన్ అధ్యక్షులు. అధ్యక్షుడు కే వెంకటేష్ మాట్లాడుతూ .... ఉదయం నుంచే పట్టణంలోని పలు ఔషధ దుకాణాలు మూతపడటంతో ప్రజలు మందుల కొనుగోలుకు ఇబ్బందులుపడ్డారు. ఈ సందర్భంగా మెడికల్ షాపుల యజమానులు, ఔషధ వ్యాపారులు సంఘటితంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఔషధ వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం. కార్యదర్శి కే నరసింహారావు. వ్యాపారులు మాట్లాడుతూ .... ఆన్‌లైన్ మందుల విక్రయాలను నియంత్రించాలని, చిన్న మెడికల్ షాపుల మనుగడకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఔషధ రంగంలో అమలవుతున్న కొన్ని విధానాల వల్ల చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా నాణ్యమైన మందుల విక్రయాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ బంద్‌కు పుత్తూరు పట్టణంలోని మెజారిటీ మెడికల్ షాపులు మద్దతు తెలిపినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య. ఆర్ హరికృష్ణ, మధు, రమేష్, నవీన్, రామకృష్ణ ,జగదీష్, పెద్ద సంఖ్యలో మెడికల్ షాపుల యజమానులు, ఔషధ వ్యాపారులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా ఏపీ విద్యా వ్యవస్థ: మంత్రి లోకేశ్

అమరావతి, పతాకం న్యూస్: దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ (వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో డీఈవోలు, ఏపీసీలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్‌పై అధికారులు దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంతబిడ్డల్లా భావించి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్ రావాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు

భారత్- ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు : ప్రధాని మోడీ

ఇటలీ: భారత్-ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో జరిగిన విస్తృతస్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్?-ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 2025-29' గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రణాళిక ఇరుదేశాల సంబంధాలను ఒక ఆచరణాత్మక, భవిష్యత్తు ఆధారిత చట్రాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇక రక్షణ, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం గురించి కూడా ఆయన మాట్లాడారు. భారత్-ఇటలీ పారిశ్రామిక రోడ్‌మ్యాప్, ఇరుదేశాలు ఉమ్మడిగా సైనిక పరికరాల అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు.భారత్-ఇటలీల మధ్య గల పురాతన నాగరికతల సంబంధాలను ప్రస్తావించిన మోదీ, రోమ్-కాశీ నాగరికతల విశిష్టతను చెప్పారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య విన్-విన్ పద్ధతిలో పరస్పర సహకారం కొనసాగుతోందని, ఇది ఇరుదేశాల సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం భారత్?-ఇటలీలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని, ఉగ్రవాదుల ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి కలిసి పనిచేస్తున్నాయన్నారు.

వైద్య విద్యార్థుల మాస్ కాపీయింగ్.. 21 మందిపై చర్యలకు కమిటీ సిఫార్సు..

అమరావతి, పతాకం న్యూస్: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థుల మాస్ కాపీయింగ్ ఘటనపై తుది నివేదికను కమిటీ సిద్ధం చేసింది. వైద్య విద్య వార్షిక పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 21 మంది విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. నివేదికను పరిశీలించిన అనంతరం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ చర్యలు తీసుకోనున్నారు. ఏప్రిల్ 2 నుంచి యూజీ మెడికల్, పీజీ మెడికల్, ఆయుష్, డెంటల్ వార్షిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు కాపీ కొడుతూ పట్టుబడ్డారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, స్లిప్పుల ద్వారా మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. అయితే, పరీక్షల నేపథ్యంలో 28 మెడికల్, 9 డెంటల్, 7 ఆయుష్ కళాశాలల్లో 540 కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిని విశ్వవిద్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు.

పరీక్షల్లో కాపీ కొడుతున్న విషయాన్ని కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులు గుర్తించారు. వెంటనే ఇన్విజిలేటర్లను అప్రమత్తం చేసి కాపీయింగ్ చేస్తున్న విద్యార్థులను పట్టుకున్నారు. దీనిపై నిజనిజాలు తేల్చేందుకు కమిటీని ఏర్పాటు చేయగా.. తాజాగా 21 మందిపై చర్యలకు సిఫార్సు చేసింది.ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, బంగారం వంటి విలువైన వస్తువులు తరలిస్తూ స్మగ్లర్లు భారీగా పట్టుపడుతున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

భూముల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు..!

సీనియర్ అసిస్టెంట్‌ను కూడా పిలిచి విచారించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సుమారు రూ.ఐదు కోట్ల వరకు ప్రభుత్వ ఖాజానాకు ఆదాయం రావాల్సి ఉండగా కేవలం రూ.90 లక్షలు మాత్రమే స్టాంప్ ఫీజు ద్వారా వచ్చినట్లు తెలిసింది. వ్యవసాయ భూములుగా చూపించి.. తక్కువ స్టాంప్ డ్యూటీ వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తే.. మరిన్ని వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాల కిందట శ్రీకాకుళం పట్టణంలోని కోనవీధిలో డోర్ నెంబర్ 7-3-15లో డగ్లస్ విద్యా సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. ఆ సంస్థకు సాలూరులో మూడు ఎకరాల 14 సెంట్లు భూమి ఉంది.అయితే 2025లో అదే సంస్థను మళ్లీ రిజిస్టర్ నెంబర్ 290 పేరిట తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. ఆ సంస్థకు చెందిన భూముల కోసమా.. లేక మరి దేని కోసం ఇలా రిజిస్ట్రేషన్ చేశారన్నది విచారణలో తేలాల్సి ఉంది.

ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి: అచ్చెన్నాయుడు

తక్షణమే విచారణ జరపాలని ఆయన సూచించారు. రైతులకు సాగు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఇకపై ప్రతిరోజూ జిల్లాల వారీగా ఎరువుల నిల్వలపై (స్టాక్) ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్నదాతలను మోసం చేసే ఏ ఒక్క చర్యను ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఏ డీలరైనా ఎరువులను బ్లాక్‌కు తరలించినా లేదా పక్కదారి పట్టించినా వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆజ్ఞాపించారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఉపాధి కూలీ చికిత్స పొందుతూ మృతి

కోనసీమ, పతాకం న్యూస్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కూలీలను ఇబ్బందులకు గురి చేశాలా ప్రవేశపెట్టిన నూతన విది విధానాలతో స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో కాకినాడ రూరల్ మండలంలోని చీడిగ గ్రామానికి చెందిన 5 ఉపాధి హామీ పథకం కూలీలు మృతి చెందిన ఘటన మరువక ముందే డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉప్పలగుప్తం మండలం సరిపల్లి గ్రామం లో ఇదే తరహాలో మరో ఘటన చోటు చేసుకుంది. ఉప్పలగుప్తం మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన మట్టపర్తి అనంతలక్ష్మి (57) మంగళవారం ఉపాధి పనికి ఆటోలో వెళుతూ ఉండగా ఆమె ప్రయాణిస్తున్న ఆటో నుండి ప్రమాదవశాత్తు పడిపోవడంతో గాయాల పాలయ్యింది. అనంతలక్ష్మిని అమలాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా వైద్యులకు తెలిపిన వివరాల ప్రకారం ఆమె కోమాలోకి వెళ్లిన సంగతి వెలుగులోకి వచ్చింది. బుధవారం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. మృతి చెందిన అనంతలక్ష్మి కి భర్త గతంలోనే చనిపోయారు. ఆమెకు వివాహితుడైన ఒక కుమారుడు ఉన్నాడు. ఉపాధి హామీ పనులు చేసుకుంటూ అనంతలక్ష్మి కుమారుడు వద్ద జీవనం కొనసాగిస్తుంది. ఉపాధి హామీ పథకం పనికి వెళుతూ ఆటో నుండి పడిపోయి గాయాల పాలైన అనంతలక్ష్మికి సరైన సమయంలో అధికారులు వైద్యం అందించలేదని ఎంపీడీవో ఇతర ఉన్నత అధికారుల నిర్లక్ష్యంతో అనంతలక్ష్మి మృతి చెందిందని ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ నేత పొలమూరి మోహన్ బాబు అధికారులకు కోరారు. కనీసం జిల్లా అధికారులు సైతం ఎవరూ కూడా ఆమెకి న్యాయం చేయలేదని ఆయన ఆవేదన చెందారు. పేదల ప్రాణాలు గాలికి వదిలేసి పని ప్రదేశంలో కల్పించవలసిన కనీస సౌకర్యాలు కల్పించడం లేదని తక్షణమే ప్రభుత్వ అధికారులు మట్టపర్తి అనంతలక్ష్మి కుటుంబానికి 10 లక్షల రూపాయలు నష్టపరహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.

విశాఖ బీచ్ రోడ్డులో ప్రత్యేక ఆకర్షణగా బంగారు వర్ణపు కారు

విశాఖపట్నం, పతాకం న్యూస్: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గత రెండు రోజులుగా ఓ బంగారు వర్ణపు కారు అందరినీ ఆకట్టుకుంటోంది. విశాఖలోని బీచ్ రోడ్డులో నిలిచిన ఈ కారు ప్రత్యేక ఆకర్షణంగా మారింది. బంగారు రంగుతో ఈ కారు మెరుస్తుండటంతో చాలామంది దానిని చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంతమంది ఈ కారుతో సెల్ఫీలు దిగుతున్నారు. కారు యజమాని ఈ కారుకు బంగారు రంగు వేయించారు. యజమాని రవి మాట్లాడుతూ, తమకు జ్యువెల్లరీ వ్యాపారం ఉందని, అందుకే కారుకు బంగారపు రంగు వేయించినట్లు చెప్పారు. ఈ కారు తెలుగు రంగులో వచ్చిందని, కానీ విశాఖలోనే బంగారపు రంగును వేయించానని చెప్పారు. దీని కోసం రూ.1 లక్ష ఖర్చయిందని, పూర్తవడానికి నెల రోజులు పట్టిందని వెల్లడించారు. బంగారపు రంగు వేయడానికి ప్రత్యేకంగా కారణమేమీ లేదని, సరదాగా వేయించానని అన్నారు. దీనికి ఐదేళ్లు గ్యారెంటీ ఇచ్చినట్లు చెప్పారు.

భర్తతో గొడవ.. గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న భార్య

సింహాచలం, పతాకం న్యూస్:విశాఖ సింహాచంలో విషాదం చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో వివాహిత బంటుపల్లి ఇందుమతి (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. మృతురాలి భర్త బంటుపల్లి మహేశ్‌తో గత రాత్రి గొడవ జరగడంతో ఇందుమతి గదిలోకి వెళ్లి బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. భార్య ఎంతకీ కనపడకపోవడంతో భర్త గదిలో వెళ్లి చూడగా.. ఇందుమతి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. దీంతో వెంటనే ఆమెను కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఇందుమతి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ-పర్మిట్ విధానం

నర్సీపట్నం, పతాకం న్యూస్: వ్యవసాయ మార్కెట్ కమిటీలలో త్వరలో మాన్యువల్ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికి ఇ-పర్మిట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతుంది. ఈ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన వ్యాపారులు (ట్రేడర్లు) 290 మంది ఉన్నారు. అనకాపల్లి ఏఎంసీలో 120, నర్సీపట్నం 79, చోడవరం 20, మాడుగుల 13, పాయకరావుపేట 28 మంది, ఎలమంచిలి 30.. మొత్తం 290 మంది వ్యాపారులు ఉన్నారు. ఇప్పటి వరకు మాన్యువల్ విధానంలో లావాదేవీలు నిర్వహించేవారు. ప్రభుత్వం ఇ- పర్మిట్ విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ట్రేడర్లు అందరూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. వ్యాపారులకు ఇచ్చిన లాగిన్‌లో నెలవారీ కొనుగోలు వివరాలు నమోదు చేస్తారు. మార్కెట్ కమిటీకి చెల్లించాల్సిన సెస్సు అమౌంట్ కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తారు. ప్రస్తుతం ట్రేడర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నది. సాంకేతిక సమస్యల కారణంగా ప్రక్రియ కాస్త ఆలస్యంగా జరుగుతోంది.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

పాయకరావుపేట, పతాకం న్యూస్: మండలంలోని ఈదటం, పాయకరావుపేట ఇందిరా కాలనీ, పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, తదితర గ్రామాల్లో ఆరు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు సుమారు దశాబ్ద కాలం నుంచి అసంపూర్తిగా వుండిపోయాయి. వీటిని అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకునేలా వున్నాయి. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాత కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టారు. శ్లాబ్, గోడలకు ప్లాస్టరింగ్ వంటి పనులు పూర్తయిన తరువాత మిగిలిన విద్యుత్తు, ఫ్లోరింగ్, ప్లంబింగ్, ఫర్నిచర్, పెయింటింగ్ వంటి పనులకు నిధులు చాలని పరిస్థితి ఏర్పడింది. దీంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులు పూర్తిచేయకుండా వదిలేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు పూర్తిచేయించకుండా వృథాగా వదిలేసింది. భవనాలు వినియోగంలోకి రాకపోవడంతో చుట్టూ తప్పలు పెరిగిపోయాయి. కిటికీలకు అమర్చిన ఇనుప గ్రిల్స్ తుప్పుపట్టాయి. రాత్రిపూట మందుబాబులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఈ భవనాలు అడ్డాగా మారాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను చాలీచాలని వసతితో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించి, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు పూర్తిచేయించి, వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదరిక నిర్మూలనలో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలి

అనకాపల్లి, పతాకం న్యూస్:పేదరిక నిర్మూలనలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వివిధ కంపెనీల యాజమాన్యాలతో జరిగిన 'స్వర్ణాంధ్ర విజన్ ఎట్ ది రేట్ ఆఫ్ 2047' సదస్సులో ఆమె మాట్లాడుతూ, పరిశ్రమల నిర్వాహకులు ఏదైనా ఒక గ్రామాన్ని లేదా మండలాన్ని దత్తత తీసుకొని ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజల ఆర్థికాభివృద్ధికి అండగా నిలవాలని సూచించారు. స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్‌కు విరివిగా విరాళాలు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ స్టేట్ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్రప్రదేశ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ విజన్ సాధనలో పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం కీలకమన్నారు. సమావేశంలో సీపీవో రామారావు, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుపడిన హైగ్రేడ్ గంజాయి..

హైదరాబాద్, పతాకం న్యూస్:శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైగ్రేడ్ గంజాయి భారీగా పట్టుపడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు అత్యంత చాకచక్యంగా వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో హైగ్రేడ్ గంజాయిని ప్యాక్ చేసి స్మగ్లింగ్‌కు ప్రయత్నించారు. మొత్తం 8.705 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.05 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

తర్లువాడలో సెమీకండక్టర్ యూనిట్

విశాఖపట్నం, పతాకం న్యూస్: విశాఖపట్నం జిల్లాలో సెమీ కండక్టర్ అసెంబ్లింగ్ పరిశ్రమ ఏర్పాటుకానుంది. ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములు పక్కనే ఈ సంస్థకు 30 ఎకరాలు కేటాయించారు. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ప్రైవేటు లిమిటెడ్ పేరుతో వ్యవహరిస్తున్న ఈ సంస్థ రెండు దశల్లో రూ.2,387.81 కోట్ల పెట్టుబడి పెడతామని ఒప్పందం చేసుకుంది. ఈ పరిశ్రమ ద్వారా వేయి మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. తొలి దశలో రూ.542.19 కోట్లు వెచ్చించి 200 మందికి ఉద్యోగాలు ఇస్తుంది. రెండో దశలో రూ.1,845.61 కోట్లు పెట్టి యూనిట్‌ను పూర్తి చేసి మిగిలిన 800 మందికి ఉపాధి కల్పిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దేశీయంగా సెమీ కండక్టర్ల తయారీని ప్రోత్సహించడానికి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఇందుకోసం అవుట్ సోర్స్‌డ్ సెమీ కండక్టర్ అసెంబిల్ అండ్ టెస్ట్ ఫెసిలిటీ (ఓఎస్ఏటీ) ప్రాజెక్టును ప్రారంభించింది. ఆ పథకం కింద సెమీ కండక్టర్ల అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకింగ్ యూనిట్ పెట్టడానికి హైదరాబాద్‌కు చెందిన ఏఎస్ఐపీ ముందుకువచ్చింది. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఎకరా రూపాయి చొప్పున 30 ఎకరాలు కేటాయించింది. వీరికి ఏపీఐఐసీ ద్వారా సేల్ అగ్రిమెంట్ చేయాల్సి ఉండగా, సంస్థ సేల్ డీడ్ (పూర్తి హక్కులు) చేయాలని కోరగా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సూచనతో రాష్ట్ర ప్రభుత్వం దానికి ఆమోదం తెలిపింది. తర్లువాడలో సర్వే నంబరు 1/పిలో 27.83 ఎకరాలు, పక్కనే ఆనుకొని ఉన్న గిడిజాల గ్రామంలో 378/పిలో 2.169 ఎకరాలు కేటాయించారు.

శిథిలావస్థకు చేరిన జీసీసీ బ్రాంచి కార్యాలయం

కొయ్యూరు, పతాకం న్యూస్: మూడు దశాబ్దాల క్రితం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జీసీసీ బ్రాంచి కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులు ఊడి, గోడలు బీటలు బారి, వర్షాలకు శ్లాబ్ లీకవుతూ ఏ క్షణాన కూలుతుందో తెలియని దుస్థితిలో ఉంది. ఈ భవనంలోనే గత దశాబ్ద కాలంగా భయాందోళనతోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జీసీసీ బ్రాంచి కార్యాలయ భవనాన్ని 1997లో నిర్మించారు. దీన్ని ఆనుకుని బ్రాంచి మేనేజర్ నివాస గృహాన్ని కూడా నిర్మించారు. అయితే బ్రాంచి మేనేజర్ నివాస గృహం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలం కాగా, కార్యాలయ భవనం నాటి నుంచి నేటి వరకు కనీస మరమ్మతులకు నోచకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఈ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి, గోడలు బీటలువారి చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయం మొత్తం తడిసి ముద్దవుతోంది. గత ప్రభుత్వంలో జీసీసీ చైర్మన్ మండల పర్యటనలో భాగంగా జీసీసీ బ్రాంచి కార్యాలయ దుస్థితిని చూసి వెంటనే భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. అయితే నిధులు మాత్రం మంజూరు చేయలేదు. వర్షం కురిస్తే రికార్డులను భద్రపరుచుకోవడం సిబ్బందికి సవాల్‌గా మారింది. అలాగే ఏ క్షణాన కూలుతుందోననే భయంతోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జీసీసీ చైర్మన్ ఈ భవన దుస్థితిని దృష్టిలో ఉంచుకుని నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని సిబ్బంది కోరుతున్నారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

సాలూరు, పతాకం న్యూస్: గిరిశిఖర గ్రామస్థులకు డోలీ మోతలు తప్పడం లేదు. అత్యవసర వేళల్లో వైద్య సేవల కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సాలూరు మండలం కొదమ పంచాయతీలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బందపాయి గ్రామానికి చెందిన సోడిపిల్లి టీటమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం సాయంత్రం కడుపునొప్పి ఎక్కువవడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు డోలీ కట్టారు. ఆమెను మోసుకుంటూ.. బందపాయి నుంచి సుమారు 5 కిలోమీటర్లు రాళ్లు రప్పలు దాటి.. కొండ దిగి లోద్ద గ్రామం వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి బైకులో మక్కువ మండలం దుగ్గేరు వరకు వెళ్లారు. ఆ గ్రామం నుంచి ఆటో ద్వారా పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి టీటమ్మను తీసుకెళ్లారు. వైద్యులు సత్వరం చికిత్స అం దించడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. మంగళవారం ఉదయం ఆమెను డిశ్చార్జి చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాగా తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్యసేవల కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆ ప్రాంతవాసులు వాపోయారు. గ్రామంలో ఎవరికి ఆరోగ్యం బాగోలేకపోయినా... డోలీ మోతలు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. టీటమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో రూ.1400 కోట్లతో అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు.

రీసర్వేలో పార్వతీపురం ముందంజ

పార్వతీపురం, పతాకం న్యూస్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రీసర్వేలో పార్వతీపురం మన్యం జిల్లా ముందంజలో ఉందని సీసీఎల్ఏ జి.జయలక్ష్మి తెలిపారు. భూ రికార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఖాతాల సవరణ పురోగతిపై అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఉన్న గ్రామాలు, ఖాతాల సంఖ్య, ముద్రణకు సిద్ధంగా ఉన్న రికార్డులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చించారు. భూ రికార్డుల ముద్రణ ప్రక్రియలో 94.71 శాతంతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలిచిందని ఆమె తెలిపారు. పెండింగ్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సకాలంలో పాస్ పుస్తకాలు అందించాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, పాలకొండ ఐటీడీఏ పీవోలు ఆర్.వైశాలి. పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు. రోజువారీ విధుల్లో రెవెన్యూ అధికారులు కేవలం ఒక ఫైల్‌కో, ఒక గ్రామానికో పరిమితం కాకూడదని కలెక్టర్ తెలిపారు. మండలం, జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పనులపై బర్డ్ఐ ఫ్యూ కలిగి ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. డీఎల్ఆర్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉండరాదన్నారు. 56 గ్రామాల్లో త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయాలనిఆదేశించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకకాలంలో ఈ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ పనుల్లో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. భూ రికార్డులకు సంబంధించిన కాపీలను ముందుగా డోర్‌టు డోర్ పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు..

విజయనగరం, పతాకం న్యూస్: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చాలా మండలాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. విజయనగరంలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 11 గంటల నుంచి 4 వరకూ వ్యాపార సముదాయాలన్నీ మూతపడ్డాయి. ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. కూలీలు, రోడ్డు పక్కన వ్యాపారులు ఇబ్బందులు పడడం కనిపించింది. పశువులు, మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఎండల తీవ్రత మరో రెండు రోజులు ఇలాగే ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తలకు టోపీ, గొడుగు వినియోగించాలంటున్నారు. వేసవి దృష్ట్యా అన్ని పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచినట్టు డీ ఎంహెచ్‌వో జీవనరాణి తెలిపారు.

జిజిహెచ్ ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహార దీక్ష

కాకినాడ, పతాకం న్యూస్: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ .... సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 57వ రోజైన బుధవారం కూడా నిర్వహించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ .... జిజిహెచ్ ఆర్ఎంసి లలో సెక్యూరిటీ సేవల కాంట్రాక్టు ప్రారంభమై ఏడాది కావస్తున్నా సెక్యూరిటీ గార్డ్స్ జీతం కేవలం 12,099 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 13,960 రూపాయలు చెల్లించాలన్నారు. గతం నుండి అమలవుతున్న 13 క్యాజువల్ లీవులు రద్దు చేసి జీతాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకున్న కొంతమందిని విధులకు దూరం చేసారని తెలిపారు. ఈ నేపథ్యంలో మార్చి 25 న రిలే నిరాహారదీక్ష ప్రారంభించామన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవడం వల్ల జిజిహెచ్ అధికారులు స్పందించారన్నారు. తాజాగా బుధవారం ఉదయం కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ స్థానిక ఇంచార్జ్ కార్మికులతో చర్చలు ప్రారంభించారని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం అయ్యే వరకు ఆందోళన సాగిస్తామన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యమానికి అండగా నిలిచిన కార్మిక సంఘాలకు ఉద్యమ అభినందనలు తెలిపారు. 57 వ రోజు దీక్షల్లో సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె.భాగ్యలక్ష్మి, శేరు దుర్గ, పోతుల దేవి లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు , శ్రీనివాస్, బాలరాజు , సోమరాజు , భాస్కరరావు , షఫీఖాన్, కామేష్, ధనలక్ష్మి, ఆదినారాయణ, సత్యవతి, రవి , రామకృష్ణ, ప్రేమ్, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఉపాధి శ్రామికులు మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలి

నంద్యాల, పతాకం న్యూస్:: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి, జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ .... పేదలు ఉపాధి శ్రామికులు మరో స్వతంత్ర పోరాటానికి సంసిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ పిలుపునిచ్చారు. బుధవారం రోజు జూపాడు బంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కర్ణ హాజరై మాట్లాడుతూ .... గతంలో పేదలు వ్యవసాయ శ్రామికులు తిండైనా పెట్టాలి పనైనా చూపాలి అని ఎర్రజెండా నాయకత్వాన పెద్ద ఎత్తున పోరాడిన ఫలితంగా యూపీఏ 2 లో వామపక్ష ఎంపీలు పార్లమెంటులో ఎక్కువ సంఖ్య ఉన్నందున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకురావడం జరిగిందని ఈ చట్టం వచ్చిన తర్వాత పేదలకు కొంత మెరుగుపడిందని కొనుగోలు శక్తి పెరిగిందని పనులు లేని దినాలలో కడుపు నింపే ఈ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరిస్తూ మహాత్మా గాంధీజీని చంపిన వ్యక్తి జి రాంజీ పేరుతో చట్టం చేస్తూ ఆగమేఘాలపై అమలు చేస్తూ అనేక ఆంక్షలు విధించడం పేదలకు ఉపాధి చట్టాన్ని దూరం చేయడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి రెండు వందల రోజులు పని దినాలు కల్పించి పెరిగిన ధరలకు అనుకూలంగా రోజు వేతనం 700 ఇవ్వాలని పనుల దగ్గర వసతులు కల్పించాలని పనిచేసే వారందరికీ పనిముట్లు ఇవ్వాలని జాబ్ కార్డులు లేని వారికి జాబు కార్డు ఇవ్వాలని తదితర భవిష్యత్తులో ఈ సమస్యను పరిష్కారం కొరకు ఎర్రజెండా చేసే పోరాటాల్లో పేదలు వ్యవసాయ శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ సెక్రెటరీ శాలుభాష గారికి ఉపాధి శ్రామికులతో కలిసి అందజేశారు.

కుటుంబాలతో గిరిజనుల నిరసన

శృంగవరపుకోట, పతాకం న్యూస్: రోడ్డు కోసం రేగపుణ్యగిరి గిరిజనులు చాలా నెలలుగా ఎదురుచూస్తున్నారు. నేతలకు, అధికారులకు విన్నవించారు. అందుకు స్పందనగా పనులైతే చేపట్టారు. కానీ సగంలో ఆపేశారు. దీంతో ఇక తాడోపేడో తేల్చుకుందామని వారంతా ఎస్.కోట ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. వాస్తవానికి రేగ పుణ్యగిరి రోడ్డుకు ఉపాధి హామీ నుంచి రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. ఎనిమిది పనులుగా విభజించారు. రెండు పనుల అంచనాలను మాత్రమే అధికారులు అప్‌లోడ్ చేశారు. వచ్చే జూలై నాటికి మిగిలిన పనులను అప్‌లోడ్ చేయకపోతే నిధులు రద్దయ్యే ప్రమాదం ఉందని కాంట్రాక్టర్ అనుమానం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణం కోసం గిరిజనులకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో గిరిజనులు ఏదో ఒకటి తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని రాత్రయినా ఇంటికి వెళ్లలేదు. కార్యాలయ ఆవరణకు భోజనాలు తెప్పించుకున్నారు. అక్కడే చిన్న పిల్లలతో సహా నిద్రించారు. తిరిగి మంగళవారం ఉదయం నుంచి నిరసనకు దిగారు. రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేవరకు ఇక్కడ నుంచి కదలబోమంటూ భైఠాయించారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి గిరిజనులతో చర్చలు జరిపారు. పంచాయతీరాజ్ డీఈఈ స్వామినాయుడును పిలిపించారు. రోడ్డుపనులు పర్యవేక్షిస్తున్న సహాయ ఇంజనీర్ ఐశ్వర్యను పనుల ప్రగతిపై ఆరా తీసారు. జిల్లా ఉన్నతాధికారులతోనూ ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనులన్నింటికీ జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ అనుమతి ఇచ్చారని తెలుసుకున్నారు. తక్షణం పనులు చేపట్టాలని కాంట్రాక్టరు శేషుకు సూచించారు. బుధవారం నుంచి పనులు చేపట్టకుంటే మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాల్సి వస్తుందని అన్నారు. రెండు రోజుల వ్యవధిలో పనులు చేపడతామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో గిరిజనులు శాంతించారు. శుక్రవారం నాటికి రోడ్డు పనులు చేపట్టకుంటే తిరిగి ఆందోళనకు దిగుతామని గిరిజనులకు మద్దతుగా నిలిచిన సీపీఎం నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు, చెలికాని ముత్యాలు హెచ్చరించారు.

ములాఖత్ వద్దే న్యాయ సేవలు

శ్రీకాకుళం, పతాకం న్యూస్: ఇకపై జైలు ములాఖత్ వద్దే న్యాయ సేవలు లభించే వీలు కల్పిస్తూ న్యాయ సేవాధికార సంస్థ చర్యలు చేపడు తోందని ఆ సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. ఈ మేరకు అంపోలులోని జిల్లా జైలులో న్యాయ సేవాకేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముద్దాయిలకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన న్యాయ సహాయం అందిం చేందుకు ఈ డెస్క్ దోహదపడుతుందన్నారు. న్యాయ సేవలు అందించేందుకు ఇద్దరు న్యాయవాదులు, ఇద్దరు పారా లీగల్ వలంటీర్లు అందుబాటులో ఉంటారని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జైలు పరిసరాల్లో పరిశు భ్రతను పరిశీ లించారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్ నాయుడు, డిఫెన్స్ న్యాయ వాదులు పుట్టా అంజనీకుమార్, ఆఫీసు నాయుడు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

500 మొబైల్ ఫోన్ల రికవరీ

తిరుపతి, పతాకం న్యూస్: : జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 14వ విడతలో భాగంగా సుమారు రూ.కోటి విలువైన 500 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు ఎస్పీ సుబ్బరాయుడు వివరాలను తెలియజేశారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన 13 దశల్లో రూ.10,52,70,000 విలువజేసే 4,785 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అప్పగించారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళల్లోనూ ట్రాక్ చేసి మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఇంటినుంచే సీఈఐఆర్ సేవల ద్వారా ఫిర్యాదు నమోదు చేసి ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం కల్పిస్తున్నారు. తిరుపతి సైబర్ క్రైమ్ సీఐ ఆర్.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మొబైల్ ట్రాకింగ్, రికవరీ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తోందని ఎస్పీ ప్రశంసించారు. ఏఎస్పీ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట: మంత్రి సంధ్యారాణి

విజయనగరం, పతాకం న్యూస్: మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఎగ్ కార్ట్స్‌ను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం నాలుగు సంఘాలకు రూ.2 లక్షల విలువైన నాలుగు ఎగ్ కార్ట్స్‌ను పంపిణీ చేసిందన్నారు. ప్రతి యూనిట్‌కు గ్యాస్ స్టో, సిలిండర్ కూడా అందజేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఇస్తు న్న ఆర్థిక ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్ అధి కారులతో పాటు సాలూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ

శ్రీకాకుళం, పతాకం న్యూస్: జిల్లాలోని ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. ఇందులో భాగంగా ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో ఎయిమ్స్ డైరెక్టర్, నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లాలోని ప్రజారోగ్య సమస్యలు, ముఖ్యంగా ఉద్దానంలో కిడ్నీవ్యాధుల తీవ్రతకు కారణాలపై చర్చించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలు, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన నూతన వైద్య విధానాలు, శాశ్వత పరిష్కార మార్గాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఉద్దానం కిడ్నీ బాధితుల పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను, తోడ్పాటును ఎయిమ్స్ డైరెక్టర్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వివరించారు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇటీవల అందుబాటులోకి తెచ్చిన అధునాతన వైద్య సేవలు, డయాలిసిస్ సదుపాయాల ప్రస్తుత స్థితిగతులను క్షుణ్ణంగా తెలియజేశారు. కిడ్నీ బాధితులకు మరింత మెరుగైన, అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎయిమ్స్ సంస్థ కలిసి పనిచేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఉద్దానంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించేందుకు, బాధితులకు మరింత భరోసా కల్పించేందుకు త్వరలోనే జిల్లాలో పర్యటించాలని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌ను కేంద్రమంత్రి కోరారు. ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి, వైద్యపరంగా మరిన్ని కీలక సూచనలు, సలహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

అవును జాతీయ జంతువుగా ప్రకటించాలి: జమియత్ ఉలేమా చీఫ్

న్యూఢిల్లీ, పతాకం న్యూస్: ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించాలని జమియత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ బుధవారం అన్నారు. మైనారిటీ వర్గంపై జరుగుతున్న విద్వేషపూరిత ప్రసంగాలు, దాడుల వెనుక ఈ పవిత్ర జంతువు చుట్టూ అల్లుకున్న విభజన రాజకీయాలే మూలకారణమని ఆయన పేర్కొన్నారు. విద్వేష రాజకీయాలు, పెరుగుతున్న మూకదాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించడం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని మదానీ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరు అడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. దేశంలోని మెజారిటీ వర్గం ఆవును పవిత్ర జంతువుగా మాత్రమే కాకుండా, తల్లిగా కూడా భావిస్తుందని తెలిపారు. ఆవు పేరుతో జరిగే రాజకీయ ఆట ఇకనైనా అంతం కావాలని ఆకాంక్షించారు. మతం పేరుతో జరిగే రాజకీయాల వల్ల ఎవరి ప్రాణాలు పోకూడదని అన్నారు. దేశంలో మత విభజన, విద్వేష రాజకీయాలకు శాశ్వత పరిష్కారం కావాలని అన్నారు.

మోడీ వ్యాఖ్యలకు నిరసనగా బంగారం షాపుల బంద్

అమరావతి, పతాకం న్యూస్: 'ఒక సంవత్సరం పాటు బంగారం కొన వద్దు' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణకారులు, బంగారు దుకాణాల యజమానులు నిరసన తెలిపారు. స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండవ ముంబయిగా పేరుగాంచిన కడప జిల్లా ప్రొద్దుటూరులో బంగారు వర్తకులు పూర్తిగా బంద్ పాటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు అనంతపురం, రాయదుర్గం, కడప జిల్లాలోని మైదుకూరులలో కూడా బంగారం షాపులు పూర్తిగా మూతపడ్డాయి. మైదుకూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి తమ నిరసన తెలిపారు. విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ఇతర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కొందరు వ్యాపారులు తమ దుకాణాల్లో బంగారానికి బదులు బెంగాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోడీ కొనుక్కుని తిన్న 'ఝల్‌మురి' విక్రయిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు తాలూకా స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు యు.ఇలియాస్ మాట్లాడుతూ... సంవత్సరం పాటు బంగారు కొనుగోలు చేయవద్దని ప్రధాని చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుతం స్వర్ణకారుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనాతో ఒకసారి, నోట్ల మార్పిడితో మరోసారి, రేట్లు పెరుగుదలతో ఇంకోసారి స్వర్ణకారులు తీవ్రంగా నష్టపోయారన్నారు.ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలు, ఆభరణాల తయారీ, పాలిషింగ్, డిజైనింగ్ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.అనంతరం తహశీల్దార్ భాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో బంగారు దుకాణాలు మూసివేసిన స్వర్ణకారులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణకారుల సంఘం నేతలు మాట్లాడుతూ, ఇప్పటికే అంతంతమాత్రంగానే జీవనోపాధి కొనసాగుతోందన్నారు. ఇటీవల భారీగా పెరుగుతున్న ధరలతో వినియోగదారులు కొనుగోళ్లు తగ్గించారని, దీంతో తయారీ పనులు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. సంవత్సరం పాటు బంగారం కొనొద్దని ప్రధానే చెబితే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్వర్ణకార కుటుంబాల జీవనోపాధి దెబ్బతినకుండా ప్రత్యేక ఆర్థిక నిధులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్వర్ణకారులకు సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అధికారులకు అందజేశారు.

పీఎఫ్ చందాదారులకు శుభవార్త.. త్వరలో వాట్సాప్ సేవలు

న్యూఢిల్లీ, పతాకం న్యూస్: ఈపీఎఫ్ఓ చందాదారులకు శుభవార్త. ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సేవల కోసం త్వరలో వాట్సాప్ సేవలను ఈపీఎఫ్ఓ అందుబాటులోకి తేనుంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది వాట్సాప్‌ను వినియోగిస్తున్నారని, ఈ నేపథ్యంలో దీని ద్వారా ఎంతోమందికి చేరువ కావడం సులువవుతుందని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ఓ చందదారుల వెసులుబాటు కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పీఎఫ్ బ్యాలెన్స్, చివరి ఐదు లావాదేవీలు, క్లెయిమ్ స్టేటస్ వంటి వివరాలను వాట్సాప్ ద్వారా తెలుసుకోచ్చు. గ్రీన్ టిక్ మార్కు కలిగిన ఈపీఎఫ్ఓ వాట్సాప్ నెంబర్‌కు 'హలో' అని మెసేజ్ చేయడం ద్వారా ఈ సేవలు పొందవచ్చు. యూఏఎన్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా ఈ సేవలు లభిస్తాయి. ఈపీఎఫ్ఓకు సంబంధించిన సందేశాలు కూడా స్థానిక భాషల్లో ఎప్పటికప్పుడు అందుకోవచ్చు. ఆటోమేటెడ్ సిస్టం ద్వారా వాట్సాప్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. నెల రోజుల్లోపు ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మరోవైపు, యూపీఐ ద్వారా పీఎఫ్ నిల్వలను ఉపసంహరించుకునే వెసులుబాటు కూడా త్వరలో అందుబాటులోకి రానుందని కేంద్రమంత్రి తెలిపారు. లావాదేవీలు నిర్వహించేందుకు యూపీఐ పిన్ అవసరమవుతుందని అన్నారు. బ్యాంకు ఖాతాలో జమ అయిన మొత్తాన్ని ఏటీఎం లేదా యూపీఐ ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. ఈ సేవలు అందుబాటులోకి వస్తే 7 కోట్లమంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్రమంత్రి అన్నారు.

నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు

మెళియాపుట్టి, పతాకం న్యూస్: మెళియాపుట్టిలో చెత్త సేకరణ రిక్షాలు తప్పుపడుతున్నాయి. ప్రభుత్వం పంచాయతీల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కళ్యాణ్ పంచాయతీల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనిలో భాగంగా పంచాయతీల్లో చెత్తసేకరణకు పంచాయతీకి రెండు రిక్షాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకొన్నారు. ఈ నేపథ్యంలో మెళియాపుట్టి నెలరోజుల కిందట ఈ రిక్షాలు చేరినా పంపిణీకి నోచుకోకపోవంతో నిరుపయోగంగా మారాయి.

ఇందుపల్లి-దుగ్గిరాల బైపాస్ లైన్ క్లియర్

విజయవాడ, పతాకం న్యూస్: నిత్యం ప్రయాణికుల రైళ్లతో రద్దీగా ఉండే విజయవాడ జంక్షన్‌పై గూడ్స్ రైళ్ల ఒత్తిడి తగ్గించేందుకు రైల్వేశాఖ బైపాస్ లైన్ నిర్మాణానికి సిద్ధమైంది. ఇందుపల్లి నుంచి దుగ్గిరాల వరకు 37 కి.మీ. మేర బైపాస్‌కు డీపీఆర్ సిద్ధం చేసి రైల్వే బోర్డుకు పంపారు. ఈ లైన్ పూర్తయితే విశాఖ-చెన్నై గూడ్స్ రైళ్లు విజయవాడ స్టేషన్‌కు రాకుండానే గుడివాడ మీదుగా వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. నిత్యం ప్రయాణికుల రైళ్లతో రద్దీగా ఉండే విజయవాడ జంక్షన్ రైల్వేస్టేషన్ దాటి వెళ్లడం గూడ్స్ రైళ్లకు పెద్ద సవాలే. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు లేని సమయంలోనే గూడ్స్ రైళ్లకు సిగ్నల్ లభిస్తుండటంతో గంటల తరబడి ఏదో ఒక స్టేషన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. హౌరా, విశాఖపట్నం వైపు నుంచి చెన్నై వైపు రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్లు తప్పనిసరిగా విజయవాడ స్టేషన్ మీదుగా వెళ్లాలి. ఈ ఇబ్బందులు తీర్చేందుకు బైపాస్ లైన్ నిర్మించడానికి రైల్వేశాఖ సిద్ధమైంది.ుడివాడ-విజయవాడ లైన్‌లో కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఇందుపల్లి నుంచి, విజయవాడ-చెన్నై లైన్‌లో గుంటూరు జిల్లా దుగ్గిరాల వరకు బైపాస్ లైన్ నిర్మించనున్నారు. 37 కి.మీ. మేర బైపాస్‌కు అధికారులు డీపీఆర్ సిద్ధం చేసి రైల్వే బోర్డుకు పంపారు. ఈ బైపాస్ నిర్మాణం పూర్తయితే విశాఖ-చెన్నై మార్గంలోని గూడ్స్ బండ్లను గుడివాడ మార్గంలోనే పంపాలని యోచిస్తున్నారు. దీంతో విజయవాడ స్టేషన్‌పై గూడ్స్ రైళ్ల ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది. ప్రస్తుతం విశాఖపట్నం-చెన్నై మధ్య రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్లలో కొన్ని విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా విజయవాడ వచ్చి అక్కడి నుంచి తెనాలి మీదుగా చెన్నై వైపు వెళతాయి. మరికొన్ని గూడ్స్ రైళ్లు నిడదవోలు వద్ద నుంచి భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడకు చేరుకొని అక్కడి నుంచి తెనాలి మీదుగా వెళతాయి. ఈ రెండు మార్గాల్లోనూ విజయవాడ స్టేషన్‌కు వచ్చి వెళ్లాల్సిందే. కొత్తగా నిర్మించే బైపాస్ గుడివాడ-విజయవాడ మధ్య ఇందుపల్లి వద్ద మొదలై విజయవాడ-తెనాలి మధ్య దుగ్గిరాల వద్ద ముగుస్తుంది. దీనివల్ల విశాఖ వైపు నుంచి గుడివాడ మీదుగా వచ్చే రైళ్లు విజయవాడ స్టేషన్‌కు రానక్కర్లేదు. ఇక్కడ సిగ్నల్ కోసం గంటల తరబడి వేచి ఉండక్కర్లేదు. దీనివల్ల గూడ్స్ రైళ్ల సగటు వేగం ప్రస్తుతం గంటకు 17 కి.మీ. నుంచి గణనీయంగా పెరగనుంది.

ఇందుపల్లి-దుగ్గిరాల మధ్య డబుల్ లైన్ అవసరమని రైల్వే అధికారులు ప్రతిపాదించారు. వీటి మధ్య కృష్ణా నదిపై వంతెన కూడా నిర్మించాల్సి ఉంటుంది. దీంతో సింగిల్ లైన్‌కు అనుమతిస్తారా, రెండు లైన్లకు ఆమోదం లభిస్తుందా అనే స్పష్టత రావాల్సి ఉంది.

ఆర్టీసీని ప్రైవేటు పరం కానివ్వం: నర్సింగరావు

నెల్లూరు, పతాకం న్యూస్: ఆర్‌టిసిని ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటీకరణ కానివ్వబోమని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు అన్నారు. నెల్లూరు ఆర్‌టిసి-2 డిపో ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు చేపట్టిన పోరాటం వంద రోజులకు చేరుకున్న సందర్భంగా ఆర్‌టిసి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ...గిన్నిస్ బుక్‌లో రికార్డు సాధించిన ఆర్‌టిసి సంస్థను ప్రయివేట్ వారికి అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని అడ్డుకుంటామని తెలిపారు. ప్రయివేటీకరణ చేస్తే మహిళలకు, వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం అర్థాంతరంగా నిలిచి పోతుందన్నారు. విద్యు త్తు రంగాన్ని ప్రయివేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని కార్మికులు అడ్డుకున్నారని చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్రం ప్రయత్నించగా కార్మికులు, ఉద్యోగులు ఐక్యపోరాటాలు చేయడంతో ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందన్నారు. లేబర్ కోడ్స్ కు అనుకూలంగా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటీపడి మరీ మద్దతు ఇచ్చాయని విమర్శించారు. ఎస్ డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... ఆర్‌టిసి-2 డిపో ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ నగరంలో అనేక పోరాటాలు చేపట్టామని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్‌టిసి పరిరక్షణ కమిటీ కన్వీనర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ... విద్యుత్తు బస్సుల పేరుతో ఆర్‌టిసిని ప్రయివేటీకరణ చేసేందుకు ప్రభుత్వం రకరకాలుగా ప్రయత్నాలు చేస్తోంద న్నారు. దీనిని వ్యతిరేకిస్తూ జిల్లాలోని అన్ని కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు ఒక్కతాటి మీదకు వచ్చి పరిరక్షణ

కమిటీగా ఏర్పడి పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఈ సమస్యలపై దశల వారీగా పోరాటాలు నిర్వహించా మని గుర్తు చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఆర్.మోహన్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌కుమార్, ఎస్ డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామా అంకయ్య, రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.నరసింహారెడ్డి, శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు సిహెచ్ రాజేశ్వరి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.నారాయణరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముందుకు సాగని గృహ నిర్మాణాలు!

మక్కువ, పతాకం న్యూస్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం ప్రభావం పరోక్షంగా జిల్లాలో నిర్మాణరంగంపై పడుతోంది. నిర్మాణ సామగ్రి ధరలన్నీ అమాంతం పెరిగి పోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. దీంతో భవన నిర్మాణరంగ కార్మికులకు ఉపా?ధి కరువవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో టన్ను ఐరెన్ ధర రూ.54 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.73వేలకు చేరింది. నాణ్యమైన ఐరన్ అయితే టన్ను రూ.76వేల వరకు పలుకుతోంది. సిమెంటు బస్తా ?ధర ఫిబ్రవరిలో రూ. 280 నుంచి రూ.300 మధ్యలో ఉండేది. అయితే నేడు దాని ధర రూ.450కు చేరింది. రోడ్లు, భవనాల శ్లాబ్‌లకు వాడే మెటల్ యూనిట్ ధర రూ.3500 నుంచి రూ.4500కు పెరిగింది. దీని అదనంగా ట్రాన్స్‌పోర్టు చార్జీలు దూరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2000 వరకు చెల్లించాల్సి వస్తోంది. మక్కువ తదితర ప్రాంతాల్లో ఏటా వేసవి సీజన్‌లో రోజుకు 30 టన్నుల ఐరెన్, 2 వేల వరకు సిమెంటు బస్తాలు అమ్ముడయ్యేవి. తాజా పరిస్థితుల నేపథ్యంలో రోజుకు టన్ను ఐరెన్, వంద సిమెంట్ బస్తాలు కూడా అమ్ముడుపోవడం వ్యాపారులు వాపోతున్నారు. ఇక గ్రామాల్లో నిర్మించే బీటీ రోడ్లకు ఉపయోగించే జీఎస్పీ, వెట్‌మిక్స్ ధరలను సైతం క్వారీ యజమానులు భారీగానే పెంచేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో పాటు రా మెటీరియల్ పైన మైనింగ్ శాఖ యూనిట్‌కు రూ.వెయ్యి పెంచినట్లు వారు చెబుతున్నారు. మొత్తంగా రా మెటీరియల్ ధర యూనిట్‌కు రూ.1200వరకు పెరగ్గా, ట్రాన్స్‌పోర్టు చార్జీల భారం రూ.1500 వరకు పడుతోంది. దీంతో చాలామంది నిర్మాణాలు చేపట్టడం లేదు. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాం తాల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల మాత్రం పనులు నత్తనడకన సాగుతున్నాయి.

సిమెంటు, ఐరెన్ ధరలతోపాటుగా లేబర్ రేట్లు, ట్రాన్స్‌పోర్టు చార్జీలన్నీ అమాంతంగా పెరిగిపోవడంతో నిర్మాణదారులు పనులకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో కూలీలు ఉపాధికి దూరమవుతున్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు.

13 ఏళ్లుగా గిరిజన యువకుడు న్యాయ పోరాట విజయం

కానిస్టేబుల్ ఉద్యోగం ఇవ్వాలని హైకోర్టు తీర్పు

అమరావతి, పతాకం న్యూస్: కానిస్టేబుల్ ఉద్యోగం కోసం గిరిజన యువకుడు 13 ఏళ్లుగా సాగించిన న్యాయ పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కింది. తనపై నమోదైన చిన్న కేసు విషయాన్ని అటెస్టేషన్ ఫారంలో వెల్లడించలేదన్న కారణంతో ఉద్యోగం నిరాకరించడం సరికాదని పేర్కొంటూ, ఆయనకు కానిస్టేబుల్ (సివిల్) పోస్టులో నియామకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పేద, వెనుకబడిన తరగతులకు చెందిన యువత చేసిన చిన్న తప్పులను జీవితాంతం శిక్షగా మార్చకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. వెనుకబడిన యువతకు అవకాశాలు లేకపోతే వారు అసాంఘిక శక్తుల వైపు మళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేందు శమంతో ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్ ఎంపికను రద్దు చేస్తూ 2011, 2014లో జారీ చేసిన మెమోలను రద్దు చేసింది. నాలుగు వారాల్లో పిటిషనర్‌ను కానిస్టేబుల్‌గా నియమించాలని, వేతనాలు, సీనియారిటీ, ఇతర సేవా ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గిరిజన యువకుడు దొడ్ల పెంచలయ్య 2008లో కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేశారు. రాత పరీక్ష, శారీరక పరీక్షల్లో అర్హత సాధించి తాత్కాలికంగా ఎంపికయ్యారు. అయితే, గ్రామ రాజకీయ విభేదాల నేపథ్యంలో 2010లో ఆయనపై కేసు నమోదైంది. ఆ కేసులో ఆయన 13వ నిందితుడిగా ఉన్నాడు. ఉద్యోగానికి సంబంధించిన అటెస్టేషన్ ఫారంలో తనపై కేసు లేదని పేర్కొన్నారు. ఆ తరువాత పూర్వచరిత్ర పరిశీలించడంతో ఆ కేసు విషయం బయటపడి ఆయన నియామకాన్ని రద్దు చేశారు. పెంచలయ్య 2013లో న్యాయ పోరాటం ప్రారంభించారు. ఇదే సమయంలో ఆయనపై నమోదైన కేసును కింది కోర్టు కొట్టివేసి నిర్దోషిగా ప్రకటించింది. అయినప్పటికీ ట్రిబ్యునల్, తరువాత సింగిల్ జడ్జి కూడా ఆయనకు వ్యతిరేకంగా తీర్పులిచ్చారు. చివరకు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. పిటిషనర్‌పై నమోదైనది హత్య, దోపిడీ, అత్యాచారం వంటి తీవ్రమైన నేరం కాదని, గ్రామంలో జరిగిన చిన్న ఘర్షణ కేసు మాత్రమేనని ధర్మాసనం పేర్కొంది. గ్రామీణ గిరిజన ప్రాంతానికి చెందిన యువకుడు ఉద్యోగం పోతుందనే భయంతోనే కేసు విషయం వెల్లడించలేదని, దీనిని దురుద్దేశపూర్వకంగా చూడలేమని స్పష్టం చేసింది. సమాచారం దాచిపెట్టిన ప్రతి సందర్భాన్ని ఆటోమేటిక్ అనర్హతగా పరిగణించరాదని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని గుర్తుచేసింది.

కరెంట్ షాక్ తగిలి బాలుడు మృతి

తిరుపతి, పతాకం న్యూస్: చంద్రగిరి మండలం రంగంపేట గ్రామంలో పొలం దగ్గర ఓ బాలుడు ఆడుకుంటూ ఉండగా విద్యుత్ ప్లగ్ వైర్ ను కలబెడుతూ ఉండగా కరెంట్ షాక్ తగిలి చనిపోయాడు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు .... రామచంద్రాపురం మండలం యాగప్పరెడ్డి కండ్రిగ (మూల సపర్లు) గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు బాదూరు అర్జున్ రెడ్డి కుమారుడు బాదూరు పునీత్ రెడ్డి (7) విషాదకరంగా మృతి చెందాడు. వేసవి సెలవుల సందర్భంగా చంద్రగిరి మండలం ఏ.రంగంపేటలో ఉన్న తన మేనత్త ఇంటికి వచ్చిన పునీత్, ఇక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కాగా, పునీత్ రెడ్డి అంత్యక్రియలు బుధవారం అతని స్వగ్రామమైన యాగప్పరెడ్డి కండ్రిగలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

భూములను పరిరక్షించాలని గిరిజనుల నిరసన

పాతపట్నం, పతాకం న్యూస్: ఆదివాసీయుల భూములను పరిరక్షించా లని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్ చేశారు. మండలంలోని సవర సిద్దమణుగులో 40ఎకరాల భూమిపై ఒడిశావారు ఆక్రమణలకు పాల్పడుతున్నారని పేర్కొని ఆదివాసీ సంఘనేతలు క్షేత్రస్థాయి పరిశీలించారు. ఈ సందర్భంగా వాబయోగి మా ట్లాడుతూ సవరసిద్దమణుగులో ఒడిశాకు చెందిన కొంతమంది భూదళారులు ఆదివాసీయులకు బెదిరించి మోసాలకు పాల్పడుతూ అక్కడి భూములు కాజేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఐటీడీఏ పీవో, కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు కలుగజేసుకొని ఆదివాసీయులు సాగుచేస్తున్న భూములను రక్షించాలని, అక్కడ ఆదివాసీ మహిళలకు పూర్తిగా రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు జన్ని సంజీవరావు, ఆదివాసీ సంక్షేమపరిషత్ సభ్యుడు వాసుదేవరావు పాల్గొన్నారు.

దామోదరసాగర్‌కు మరమ్మతులు చేస్తాం

శ్రీకాకుళం, పతాకం న్యూస్: దామోదరసాగర్ ఆయకట్టు రైతుల కష్టాలను రానున్న ఖరీఫ్‌నుంచి తీరుస్తామని జలవనరుల శాఖ ఎస్ఈ సుధాకర్ తెలిపారు. మందస మండలంలోని దామోదర సాగర్ కుడి కాలువను జలవనరులు అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విన్నపం మేరకు కుడి కాలువను పరిశీలించామని, అన్నదాతల సాగునీటి కష్టాలు తొలగించి పూర్తిస్తాయి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరక్టర్ బావన దుర్యోధన మాట్లాడుతూ కుడికాలువ అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈఈ సత్యప్రసాద్, ఏఈఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఎం. చంద్రశేఖర్, అగ్గున్న జయరాజు, డొక్క లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు.. పరిస్థితి విషమం

చిత్తూరు, పతాకం న్యూస్: మండల పరిధిలోని ఏడుచుట్ల కోట సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలు .... నాయకనేరి కొత్తూరుకు చెందిన యువరాజ్ (35) బైక్ పై వీకోటకు వెళుతుండగా, ప్రమాదవశాత్తు ఏడుచుట్ల కోట్ల వద్ద నడిచి వెళ్తున్న మురుగేష్ (40) అడ్డు రావడంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మురుగేష్ యువరాజులు ఇద్దరూ కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఇద్దరిని 108 వాహనంలో వీకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కుప్పం మెడికల్ కళాశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హార్మోన్ల సమస్యలు ఉన్న మహిళలు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారాలు!

నేటి తరుణంలో హార్మోన్ల అసమతుల్యతతో బాధపడే మహిళల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మారిన జీవన విధానం,ఆహారపు అలవాట్లే ఈ సమస్యకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. అయితే హార్మోన్ల అసమతుల్యత సమస్యలు ఎదుర్కొంటున్న చాలా మంది మహిళలు నేరుగా సప్లిమెంట్స్ లేదా హార్మోన్ బ్యాలెన్సింగ్ ఉత్పత్తులవైపు వెళ్లిపోతుంటారు. శరీరం ముందుగా సిద్ధంగా లేకపోతే అలాంటి ప్రయత్నాలు ప్రయోజనం ఇవ్వకపోగా సమస్యలను మరింత పెంచే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈస్ట్రోజెన్ అధిక స్థాయిలకు సంబంధించిన లక్షణాలను తగ్గించాలంటే ముందుగా కాలేయం (లివర్) పనితీరును మెరుగుపరచడం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. శరీరంలో ఈస్ట్రోజెన్‌ను ప్రాసెస్ చేసి బయటకు పంపే ప్రధాన బాధ్యత లివర్‌దే. మొదట లివర్ ఈస్ట్రోజెన్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. తరువాత దానిని శరీరం నుంచి బయటకు వెళ్లేలా ప్యాక్ చేస్తుంది. ఈ ప్రక్రియ మందగిస్తే ఈస్ట్రోజెన్ పూర్తిగా బయటకు వెళ్లకుండా మళ్లీ శరీరంలోనే తిరుగుతుందని, దీనినే ఈస్ట్రోజెన్ డామినెన్స్ అంటారని నిపుణులు వివరిస్తున్నారు.

ఈ పరిస్థితిని సరిచేయడానికి ముందుగా గట్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. రోజుకు 25 నుంచి 35 గ్రాముల ఫైబర్ తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను మెరుగుపరచవచ్చని చెబుతున్నారు. ఇందుకు అరటి పండ్లు, మునగ ఆకులు, మెంతులు, అవిసె గింజలు వంటి ఆహారాలు ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. అయితే శరీరం ఎంతవరకు ఫైబర్‌ను తట్టుకోగలదో దాన్ని బట్టి మోతాదును నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు. అలాగే పెరుగు, కాంజీ, ఇంట్లో తయారుచేసిన పచ్చళ్ళ వంటి ఫెర్మెంటెడ్ ఫుడ్స్ కూడా గట్ ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెబుతున్నారు. గట్ ఆరోగ్యం మెరుగైన తర్వాత లివర్‌కు అవసరమైన పోషకాలను అందించడం ముఖ్యం. గుడ్లు, షిటాకే మష్రూమ్స్‌లో ఉండే కొలిన్ లివర్ పనితీరుకు సహాయపడుతుంది. ఉల్లిపాయ, వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు మద్దతిస్తాయి. ఆకుకూరలు, ఉడికించిన పప్పుల్లో ఉండే సహజ ఫోలేట్ కూడా ఉపయోగకరమని పేర్కొంటున్నారు. సన్‌ఫ్లవర్ గింజల్లో ఉండే విటమిన్ బి6 కూడా హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుందని చెబుతున్నారు.

అంతేకాకుండా శరీరంలో ఈస్ట్రోజెన్ మళ్లీ శోషించబడకుండా అడ్డుకోవడం కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. నారింజ, యాపిల్ వంటి పండ్లలో ఉండే గ్లూకారిక్ యాసిడ్ ఈ ప్రక్రియలో సహాయపడుతుందని వెల్లడిస్తున్నారు. ఇది గట్‌లో ఉండే కొన్ని ఎంజైమ్స్‌ను అడ్డుకొని ఈస్ట్రోజెన్ మళ్లీ శరీరంలోకి వెళ్లకుండా సహాయపడుతుందని వివరిస్తున్నారు. ఇక ఈ అన్ని దశలను పాటించిన తరువాతే ణ×వీ సప్లిమెంట్స్ గురించి ఆలోచించాలని సూచిస్తున్నారు. ణ×వీ అనేది బ్రోకోలీ, కాలీఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి క్రూసిఫెరస్ కూరగాయల్లో ఉండే సంయోగం నుంచి ఉత్పత్తి అయ్యే పదార్థం. ఇది ఈస్ట్రోజెన్‌ను సురక్షిత మార్గంలో విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. అయితే గట్, లివర్, ఎలిమినేషన్ వ్యవస్థ సరిగా పనిచేయకముందే ణ×వీ తీసుకుంటే శరీరంలో ఇప్పటికే ఉన్న బ్లాకేజ్ మరింత పెరిగి లక్షణాలు తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

అలాగే అవసరమైతే రోజుకు 1000 మిల్లీగ్రాముల డిఐఎంను కొవ్వు ఉన్న ఆహారంతో తీసుకోవచ్చని చెబుతున్నారు. అయితే అది కూడా శరీరం సిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. అప్పటికీ సమస్యలు కొనసాగితే హార్మోన్ మెటబాలిజం ఏ దశలో ఇబ్బంది పడుతోందో తెలుసుకోవడానికి ప్రత్యేక పరీక్షలు చేయించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలా మందికి ఆ దశ అవసరం ఉండదని, ముందుగా గట్, లివర్ ఆరోగ్యం మెరుగుపడితేనే ఈస్ట్రోజెన్ సంబంధిత సమస్యల్లో మంచి మార్పు కనిపిస్తుందని వివరిస్తున్నారు. మలబద్ధకం ఉన్నవారిలో ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం నుంచి వ్యర్థాలు సక్రమంగా బయటకు వెళ్లకపోతే హార్మోన్ అసమతుల్యత ఎక్కువ కాలం కొనసాగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

తుదిదశకు చించినాడ వంతెన పనులు

ఈ నెలాఖరు నుంచి వాహనాల రాకపోకలు

పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్: ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాలను అనుసంధానం చేసేటటువంటి పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని చించినాడ వంతెన మరమ్మతులు, నిర్వహణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరాయి. దీనికి సంబంధించి ఇప్పటికే 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. దాంతో ఈ నెల చివరి నాటికి వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నట్లు చెబుతున్నారు.

అదే విధంగా మరమ్మతులు నిమిత్తం 2025 జులై నుంచి ఈ వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను మాత్రమే అనుమతిస్తున్నారు. లారీలు, బస్సులు, ఇతర సరకు రవాణాల వాహనాల రాకపోకలేవీ సాగకపోవడంతో పది నెలలుగా ఇరు జిల్లాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు మరో పది రోజుల్లోనే తెరవీడనుంది.

ఈ వంతెనకు ప్రధానంగా మొత్తం 14 ఖానాలు ఉండగా 12 చోట్ల పనులు పూర్తయ్యాయి. 26, 14 నంబరు ఖానాల పరిధిలో మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇందులో 56 బేరింగులకు గాను 48 బేరింగులను అమర్చారు. పశ్చిమ వైపు ఉన్న పిల్లర్ల నుంచి పనులను ప్రారంభించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైపునకు నిర్మాణాన్ని చేసుకుంటూ వచ్చారు. వీటిలో రెండు ఖానాలో బేరింగులు, ఎక్స్?పెన్షన్లు బాగా దెబ్బతినడంతో వాటిని చివరలో చేయాలని నిర్ణయించారు. ఈ పనులు ప్రస్తుతం ఇప్పుడు కొనసాగుతుండటం విశేషం.

ఈ వంతెన పనులను చేస్తున్న కార్మికుల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారే అధికంగా ఉన్నారు. ఇటీవల ఈ రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన కారణంగా ఎక్కువ శాతం కార్మికులు స్వస్థలాలకు వెళ్లారు. దాంతో వంతెన నిర్మాణ పనుల్లో కొంతవరకు జాప్యం జరిగింది. కానీ ఆ తర్వాత కనీస నిర్వహణ పనులు, మరమ్మతులు చేయకపోవడంతో బేరింగులతో పాటు ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత మరమ్మతులతో మరో 15 ఏళ్ల వరకు మరమ్మతులు అవసరం ఉండదని జాతీయ రహదారుల విభాగం ఏఈఈ వెంకటరమణ పేర్కొన్నారు. అతి త్వరలో అన్ని వాహనాల రాకపోకలు మొదలవుతాయని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

తమిళ రాజకీయాల్లో కీలక పరిణామాలు.. విజయ్ కేబినెట్‌లో చేరనున్న వీసీకే?

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వంలో చేరేందుకు విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) సుముఖత వ్యక్తం చేసింది. మంత్రివర్గంలో చేరాలంటూ టీవీకే నుంచి మరోసారి అందిన ఆహ్వానంపై తమ పార్టీలో చర్చిస్తామని వీసీకే అధ్యక్షుడు థోల్ తిరుమావళవన్ ఈ రోజు సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ పరిణామంతో త్వరలోనే విజయ్ కేబినెట్‌లో వీసీకేకు చోటు దక్కవచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో రాజకీయ స్థిరత్వం కోసం కేంద్రంలోని బీజేపీ జోక్యాన్ని నివారించేందుకే టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్నామని వీసీకే గతంలో ప్రకటించింది. అయితే, తాజాగా ఏఐఏడీఎంకే రెబల్ శాసనసభ్యులను మంత్రివర్గంలోకి తీసుకోబోమని టీవీకే నాయకత్వం తనకు స్పష్టమైన హామీ ఇచ్చిందని తిరుమావళవన్ మీడియాకు తెలిపారు. ఒకవేళ ఏఐఏడీఎంకే అసమ్మతి నేతలను ప్రభుత్వంలోకి తీసుకుంటే, తమ మద్దతుపై పునరాలోచించాల్సి వస్తుందని గతంలో ఆయన హెచ్చరించిన నేపథ్యంలో టీవీకే ఇచ్చిన ఈ హామీకి ప్రాధాన్యత ఏర్పడింది. వీసీకేను ప్రభుత్వంలో భాగస్వామిని చేయాలన్న టీవీకే ఆకాంక్షను బహిరంగంగా తెలియజేసిన మంత్రి ఆధవ్ అర్జునకు తిరుమావళవన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో 'ఎల్లోరుక్కుమాన తలైవర్ అంబేద్కర్ ' పుస్తకావిష్కరణ సభలో రాజకీయంగా కలిసి పనిచేయాలని విజయ్ తమ పార్టీని బహిరంగంగా ఆహ్వానించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అప్పటి ఎన్నికల పరిస్థితుల కారణంగా టీవీకే కూటమిలో చేరలేకపోయినా, విజయ్ ప్రకటనను ఒక ముఖ్యమైన రాజకీయ సంకేతంగా భావించామని అన్నారు. అధికారంలో భాగస్వామ్యం పొందడం తమ పార్టీ చిరకాల రాజకీయ ఆకాంక్ష అని తిరుమావళవన్ పేర్కొన్నారు. గతంలో డీఎంకే కూటమిలో ఉన్నప్పుడు, ఆ పార్టీకి పూర్తి మెజారిటీ ఉండటంతో అధికారంలో వాటా అడిగే అవకాశం పరిమితంగా ఉండేదని గుర్తుచేశారు. "మేము కేవలం రెండు సీట్లు గెలిచినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇచ్చాం. మంత్రి పదవులు డిమాండ్ చేయలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంలో చేరడం కూడా తమ రాజకీయ దార్శనికతలో భాగమేనని, దీనిపై పార్టీ జనరల్ సెక్రటరీలు, కోశాధికారి, ఇతర సీనియర్ నేతలతో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు.

బంగ్లాదేశ్ చేతిలో పాకిస్థాన్ చిత్తు.. టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్

పాకిస్థాన్‌కు మరోసారి ఘోర పరాభవం ఎదురైంది. సిలెట్ వేదికగా జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ 78 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పాకిస్థాన్‌పై జరిగిన టెస్టు సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. తొలి టెస్టు ఆది నుంచే పాక్‌పై బంగ్లా ఆధిపత్యం చూపిస్తూ వచ్చింది. తొలి టెస్టులో పాక్ 104 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండో టెస్టులో 437 పరుగుల లక్ష్య ఛేదనలో 316/7 ఓవర్ నైట్ స్కోర్‌తో ఐదో రోజును ఆట ప్రారంభించిన పాకిస్థాన్.. వెనువెంటనే మిగిలిన 3 వికెట్లను కూడా కోల్పోయి 358 పరుగుల వద్ద ఆలౌటైంది. 75 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో బ్యాటింగ్‌కు దిగిన పాక్ స్టార్ బ్యాటర్ రిజ్వాన్(94) జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. కానీ బంగ్లా బౌలర్ తైజులు ఇస్లాం 6 వికెట్లు తీసి పాక్ పతనాన్ని శాసించాడు. రెండో టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా.. తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులకు ఆలౌటైంది. లిటన్ దాస్(126) సెంచరీతో అదరగొట్టాడు. పాక్ బ్యాటర్లలో బాబర్ ఆజం(68) మినహా మిగతా ప్లేయర్లు ఎవరూ రాణించకపోవడంతో.. పాకిస్థాన్ 232 పరుగులు చేసింది. కీలక ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా.. ఆరంభంలో కాస్త తడబడినప్పటికీ అనూహ్యంగా పుంజుకుంది. ముష్ఫికర్ రహీం(137) సూపర్ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా బంగ్లా 390 పరుగుల భారీ స్కోర్ చేసి.. మొత్తంగా 437 పరుగుల టార్గెట్‌ను పాక్‌కు నిర్దేశించింది. ఛేదనలో రిజ్వాన్(94), షాన్ మసూద్(71), సల్మాన్ అఘా(71) హాఫ్ సెంచరీలు చేసినప్పటికీ పాక్‌కు ఓటమి తప్పలేదు. పాకిస్థాన్‌పై విజయంతో డబ్ల్యూటీసీ పట్టికలో బంగ్లాదేశ్ ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో భారత్ ఆరో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, శ్రీలంక టాప్ 4 జట్లుగా కొనసాగుతున్నాయి. ఈ ఓటమితో పాక్ మరింత పతనమై ఎనిమిదో స్థానానికి పడిపోయింది. కాగా ఈ గెలుపు బంగ్లాదేశ్‌కు పాక్‌పై వరుసగా నాలుగవది కావడం విశేషం.

మార్ష్ పోరాటం వృథా.. రాజస్థాన్ రాయల్స్ కీలక విజయం

వరుసగా మూడు ఓటములతో ప్లేఆఫ్స్ బెర్త్ ప్రమాదంలో పడిన వేళ.. రాజస్థాన్ రాయల్స్ అదరగొట్టింది. టీనేజి సంచలనం వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లతో 93) సొంత మైదానంలో పిడుగల్లే విరుచుకుపడ్డాడు. దీంతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 7 వికెట్లతో విజయం సాధించింది. ప్రస్తుతం 14 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరిన రాజస్థాన్ ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళ్తుంది. మ్యాచ్‌లో ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96), ఇంగ్లిస్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60), కెప్టెన్ రిషభ్ పంత్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35) ధాటిగా ఆడారు. ఛేదనలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 225 పరుగులు చేసి గెలిచింది. జురెల్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 నాటౌట్), జైస్వాల్ (23 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా వైభవ్ నిలిచాడు.

భారీ ఛేదనను రాజస్థాన్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. ఓపెనర్ జైస్వాల్ దూకుడును మరో ఓపెనర్ వైభవ్ తుఫాన్‌గా మార్చాడు. బంతి పడిందే ఆలస్యం అన్నట్టుగా సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ నాలుగు ఫోర్లతో 23 రన్స్, నాలుగో ఓవర్‌లో 6,4,4,4తో 19 రన్స్ రాబట్టాడు. అటు ఆరంభంలో నెమ్మదిగా ఆడిన వైభవ్ ఆరో ఓవర్‌లో 6,4,4తో పవర్‌ప్లేలో జట్టు 71 పరుగులకు చేరింది. ఆ వెంటనే జైస్వాల్ వెనుదిరగగా, వైభవ్ లఖ్‌నవూ బౌలర్లను బెంబేలెత్తించాడు. పేసర్ ఆకాశ్ ఓవర్‌లో 6,4,4,6,2తో 26 రన్స్ అందించిన వైభవ్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అటు జురెల్ 12వ ఓవర్‌లో 4,6,6, వైభవ్ 6,6లతో ఏకంగా 29 రన్స్ సమకూరాయి. వైభవ్ 93 రన్స్ దగ్గర భారీషాట్‌కు వెళ్లి వెనుదిరగడంతో, రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం ప్రిటోరియస్ (7) రనౌటైనా.. జురెల్ అర్ధసెంచరీ సాధించడంతో పాటు ఫెరీరా (16 నాటౌట్) సహకారంతో ఐదు బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్లు మార్ష్, ఇన్‌గ్లీస్ మెరుపు ఆరంభాన్ని అందించారు. రాజస్థాన్ బౌలర్లకు ఈ జోడీ ఎలాంటి అవకాశాన్ని ఇవ్వకుండా పరుగుల వరద పారించింది. ఓ దశలో 250 స్కోరు కూడా సాధ్యమే అనిపించినా.. డెత్ ఓవర్లలో పుంజుకున్న రాజస్థాన్ బౌలర్లు లఖ్‌నవూ ఆశించిన స్కోరును చేయకుండా అడ్డుకోగలిగారు. తొలి ఓవర్‌లో మార్ష్ 4,6తో జోరు చూపగా.. ఆ తర్వాత ఇన్‌గ్లిస ఎక్కువగా స్ట్రయికింగ్ తీసుకుని చెలరేగాడు. నాలుగో ఓవర్‌లో 4,4,6తో 16 రన్స్ అందించాడు. దీంతో అతి తక్కువ బంతుల్లోనే (21) లఖ్‌నవూ తమ 50 రన్స్‌ను సాధించింది. ఇక ఐదో ఓవర్‌లో మార్ష్ 4,4,6.. ఆరో ఓవర్‌లో ఇన్‌గ్లిస 6,4 బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 83 పరుగులతో పటిష్టంగా నిలిచింది. ఆ తర్వాత 23 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసిన ఇన్‌గ్లిస్‌ను స్పిన్నర్ యష్‌రాజ్ బౌల్డ్ చేశాడు. అప్పటికే తొలి వికెట్‌కు 49 బంతుల్లోనే 109 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. ఈ దశలో మార్ష్ బ్యాట్ ఝుళిపించాడు. అటు పూరన్ (16)ను కూడా యష్‌రాజ్ అవుట్ చేశాడు.

23న జరిగే 'పెద్ది' ఈవెంట్‌కు రూ.150 కోట్ల ఖర్చు



రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చే నెలలో విడుదలవుతున్న 'పెద్ది' చిత్రానికి సంబంధించి, ఈ నెల 23వ తేదీన భోపాల్ వేదికగా జరగబోయే మ్యూజికల్ ఈవెంట్ వైపు అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఈవెంట్ కోసం మేకర్లు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారు. 'పెద్ది' చిత్రానికి ఎ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రమంలో మే 23న జరగనున్న మెగా వేడుకలో రెహ్మాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నారు.

ఈ లైవ్ కాన్సర్ట్ కోసం మన దేశం లో ముందెన్నడు ఉపయోగించని అత్యంత ఖరీదైన సాంకేతికతను, మ్యూజిక్ ఎక్విప్‌మెంట్స్‌ను వాడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిని ముంబై నుంచి భోపాల్ తరలిస్తున్నారు. అయితే దీనికి అద్దె రూపంలో రూ.1 కోటి వరకు చెల్లిస్తున్నారని తెలుస్తోంది.

వో 23వ తేదీన సాయంత్రం 5 గంటలకు భోపాల్‌లోని బీహెచ్ఈఎల్ దసరా గ్రౌండ్స్‌లో ఈ మెగా ఈ వెంట్ నిర్వహించ నున్నారు. ఈ ఈవెంట్ సందర్భంగా చిత్రానికి సంబంధించి స్పెషల్ సాంగ్‌ను లాంచ్ చేయనున్నారు. 'యూవీ మీడియా సంస్థ' ఈ ఈవెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తోంది. ఈ మెగా ఈవెంట్‌ను చూడాలనుకునే వారికి రేపటి నుంచి ఈవెంట్ జరిగే వేదిక వద్ద ఉచిత పాస్‌లను పంపిణీ చేస్తారు.

జియో హాట్ స్టార్‌లో 'సతీ లీలావతి'



లావణ్య త్రిపాఠి ప్రధానమైన పాత్రను పోషించిన సినిమా 'సతీ లీలావతి'. రొమాంటిక్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమాకి తాతినేని సత్య దర్శకత్వం వహించాడు. 'శాకుంతలం' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన దేవ్ మోహన్, ఈ సినిమాలో లావణ్య త్రిపాఠికి జోడీగా నటించాడు. ఈ నెల 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, నెల తిరక్కుండానే ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు (మే 20వ తేదీ) నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. లీలావతి (లావణ్య త్రిపాఠి) ఓ సినిమా డైరెక్టర్. ఆమెతో ఓ సినిమా చేయాలని చాలామంది నిర్మాతలు వెయిట్ చేస్తుంటారు. ఆమె భర్త సేతుపతి (దేవ్ మోహన్) ఓ సైకాలజిస్ట్. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల (నరేశ్ - పవిత్ర) పోట్లాటలు చూస్తూ పెరిగిన కారణంగా ఆమె మానసికంగా దెబ్బతింటుంది. ఆ సమస్య నుంచి బయటపడటానికి సాయం చేసిన సేతుపతినే వివాహం చేసుకుంటుంది. అయితే పూర్తిగా కెరియర్ పై ఫోకస్ చేసిన ఆమె, సేతుపతిని నిర్లక్ష్యం చేస్తుంది. లీలావతి ప్రవర్తనకి తాను విసిగిపోయినట్టుగా ఆమెతో సేతుపతి చెబుతాడు. తాను నికోలా సెబాస్టియన్ (మడోన్నా సెబాస్టియన్) అనే యువతిని ప్రేమించినట్టుగా చెబుతాడు. ఇకపై ఆమెతోనే జీవించాలనే నిర్ణయానికి వచ్చానని అంటాడు. తనకి విడాకులు ఇవ్వమని కోరుతూ లాయర్ ను కూడా ఇంటికి పిలిపిస్తాడు. అందుకు సంబంధించిన కాగితాలపై సంతకం చేయమని అంటాడు. తనని సేతుపతి ప్రేమించి పెళ్లి చేసుకోలేదనీ, తన తండ్రి అతనిని ఒప్పించాడనే విషయం లీలావతికి అప్పుడే అర్థమవుతుంది. సేతుపతి నిర్ణయం పట్ల ఆగ్రహావేశాలకు లోనైన లీలావతి, అతనిని ఇంట్లోనే బంధిస్తుంది. లీలావతి తండ్రి .. లీలావతితో సినిమా తీయాలనుకుంటున్న మొట్ట రాజన్ .. సేతుపతి పిలిపించిన లాయర్ .. సేతుపతి ప్రేమించిన నికోలా అక్కడికి చేరుకుంటారు. అప్పుడు లీలావతి ఏం చేస్తుంది? పర్యవసానంగా చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది కథ.

ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్ చిరంజీవి

"నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది. తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది. రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.



Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**